క్లుప్తంగా

కేశవరంలో బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

మండపేట: సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కేశవరం సొసైటీ వద్ద రైతులకు ఆ సొసైటీ చైర్మన్ గంగరాజు ఎలుకల మందు పంపిణీ చేశారు. ఎలుకలకు ఎర పెట్టే విధానం గురించి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. ఉప సర్పంచ్ ఉండమట్ల నాగతులసి, సొసైటీ డైరెక్టర్ చంద్రమల్లా రెడ్డి, సలాది శివన్నారాయణ, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇండియన్ ఐకాన్ పురస్కారం అందుకున్న కృష్ణమూర్తి



ఇండియన్ ఐకాన్ పురస్కారం అందుకుంటున్న కృష్ణమూర్తి

కె.గంగవరం: విజ్డమ్ చారిటీ అందించే ఇండియన్ ఐకాన్ పురస్కారానికి కె.గంగవరం గ్రామానికి చెందిన కొల్లి కృష్ణమూర్తి ఎంపికయ్యారు. ఈ నెల 20వ తేదీన హైదరాబాద్లోని రవీంద్రభారతిలో చారిటీ సంస్థ సభ్యుల చేతుల మీదుగా కృష్ణమూర్తి ఈ అవార్డును అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ సాహిత్యం, సాంస్కృతిక, విద్య, వైద్యం, క్రీడలు, కళలు, సామాజిక, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిందుకుగాను ఈ పురస్కారం లభించిందని తెలిపారు. పురస్కారం లభించడంపై ఏఓ రవి, గ్రామ పెద్దలు నేమాని శ్రీనివాస్, రామకృష్ణ చౌదరి, సుందర్శనం లక్ష్మీనారాయణాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పోలీసులు వత్తాసు పలుకుతున్నారు

మండపేట: ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ కార్యాలయంపై అధికార పార్టీ నాయకులు దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఆరోపించారు. పోలీసులు వారికి వత్తాసు పలుకుతున్నారని ఎమ్మెల్యే వేగుళ్ల మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు.

కాలనీ లేఅవుట్ మెరక పనుల పరిశీలన



నేలటూరు లేఅవుట్ మెరక పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: నేలటూరులోని జగనన్న కాలనీ 1,3 లేఅవుట్ల మెరక పనులను మంగళవారం తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, హౌసింగ్ ఏఈ పీవీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి సుధారాణి పరిశీలించారు. గృహాలు, రహదారుల నిర్మాణాలపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజు వివరాలు తెలిపారు. లేఅవుట్-1లో రూ.12.42 లక్షలు, లేఅవుట్-3లో రూ.5.10 లక్షలతో మెరక పనులు చేపట్టినట్టు హౌసింగ్ ఏఈ మూర్తి తెలిపారు. వారి వెంట వెల్ఫేర్ అసిస్టెంట్ జామి సత్యలక్ష్మి, మహిళా పోలీసు గౌతమి ఉన్నారు.

102 మందికి వైద్య సేవలు



నారాయణలంకలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రత్నకుమారి

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం గ్రామ శివారు నారాయణలంకలో మంగళవారం అంగర పీహెచ్సీ వైద్యాధికారి పీఎస్ఎన్డీ రత్నకుమారి 102 మందికి వైద్య సేవలందించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శిబిరంలో వృద్ధులు, చిన్నారులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. శిబిరంలో హెచ్ఈ బి.రామారావు, ఎంపీహెచ్ఎస్ సురేష్, ఎంఎల్హెచ్పీ పి.దివ్య, ఆరోగ్య కార్యకర్తలు తోటకూర రామకృష్ణ, వెన్నేటి వెంకటేశ్వర్లు, శిరోమణి, 104 డీఈఓ ప్రసాద్ సేవలందించారు.

ఎస్సీ, ఎస్టీ వర్క్ షాపును విజయంతం చేయాలి

కె.గంగవరం: ఈ నెల 25న కాకినాడలో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ వర్క్ షాపు విజయవంతం చేయాలని డాక్టర్ అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఏఏఎఫ్) రామచంద్రపురం నియోజకవర్గ అధ్యక్షుడు, న్యాయవాది సాదే నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని రామారావుపేట, సుబ్బయ్య హోటల్ దగ్గర లూథరన్ చర్చి మీటింగ్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ వర్క్ షాపు ప్రారంభం అవుతుందన్నారు. సమాజ శ్రేయస్సులో న్యాయవాదుల పాత్ర చాలా కీలకమయిందని దీనికి అనుగుణంగానే ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ప్రయోగంతో ప్రగతికి బాట

- 26 నుంచి మార్చి 7 వరకూ ఇంటర్ ప్రాక్టికల్స్
- రెండు నియోజకవర్గాల్లో 17 కేంద్రాలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న అధ్యాపకులు



ప్రాక్టికల్కు ల్యాబ్లో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

కపిలేశ్వరపురం: ఇంటర్మీడియట్ చదువులో ప్రాక్టికల్స్కు అధిక ప్రాధాన్యత ఉంది. తరగతి గదిలో విన్న, చదివిన పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించాలి. దాంతో విద్యార్థుల్లో సహజంగా భయం, ఆందోళన కలుగుతాయి. ప్రశ్నాపత్రంపైనా, మార్కులు కేటాయింపుపైనా, ప్రయోగం చేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా విద్యార్థులకు అవగాహన అవసరం. వారికి భరోసా ఇస్తూ అధ్యాపకులు చేస్తున్న సూచనలపై ఈ కథనం.

రెండు నియోజకవర్గాల్లో పరీక్షల తీరు ఇలా..

విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతి జూనియర్ కళాశాలను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసింది. దీంతో మండపేటలో 6, కపిలేశ్వరపురం 1, రాయవరం 2, రామచంద్రపురం 4, కె.గంగవరంలో 3, కాజులూరులో ఒకటి మొత్తం 17 కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో ప్రాక్టికల్స్ నిర్వహణ తీరును పర్యవేక్షిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు నాన్ జంబ్లింగ్ గానూ, అధ్యాపకులకు జంబ్లింగ్ పద్ధతి లోనూ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

డయాగ్రమ్‌లు సరిగ్గా వేయాలి



జువాలజీలో ప్రయోగ పరీక్ష మూడు భాగాలుగా ఉంటుంది. పటాన్ని గుర్తించి భాగాలను రాయాల్సినందుకు ఆరు మార్కులు, ప్రయోగాంశాలు చేసినందుకు ఐదు మార్కులు ఉంటాయి. ఇచ్చిన స్పెసిమెన్స్, స్లైడ్స్లను గుర్తించడం, వాటికి పటాలను గీయడం, వాటిలోని భాగాలను రాసినందుకు 14 మార్కులుంటాయి. రికార్డు రాసినందుకు 5 మార్కులు మొత్తం 30 మార్కులు ఉంటాయి.

–మేడిశెట్టి శ్రీనివాస్, జువాలజీ అధ్యాపకుడు, మండపేట

శాస్త్రీయతకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రయోగాలు శాస్త్రీయ పద్ధతిలో చేయాలి. సెక్షన్- ఎ లో వర్గీకరణ శాస్త్రం సెక్షన్-బి లో అంతర్ నిర్మాణ శాస్త్రం, సెక్షన్-సి లో లైవ్ ఎక్స్పర్మెంట్ పేరుతో ప్రయోగం ఉంటాయి. ఒక్కో దానికి ఆరు చొప్పున 18 మార్కులొస్తాయి. నమూనాల పరిశీలనకు ఐదు, రికార్డు రాసినందుకు ఐదు, హెర్బేరియంకు రెండు మొత్తం 30 మార్కులుంటాయి.

చుక్కా సురేష్కుమార్, బోటనీ అధ్యాపకుడు, కె.గంగవరం

మూలకాల చర్యలపై అవగాహన తప్పనిసరి



మూలకాల చర్యలపై అవగాహనతో ప్రయోగం చేయాలి. లవణ గుణాత్మక విశ్లేషణా విధానానికి 10 మార్కులు, ఘన పరిమాణాత్మక విశ్లేషణా విధానానికి 8, కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్ లేదా కొలైడ్, ఆర్గానిక్ కాంపౌండ్స్, క్రొమెటోగ్రఫీ ద్రావణాలకు 6 మార్కులుంటాయి. రికార్డు, వైవా, ప్రాజెక్టులకు రెండు చొప్పున ఆరు మార్కులుంటాయి.

–వేల్పూరి శ్రీదుర్గా రఘురాం, అధ్యాపకుడు, కెమిస్ట్రీ, అంగర

పరిసరాలపై అవగాహన ఉండాలి



ప్రయోగం చేసేటపుడు పరిసరాలపై అవగాహన ఉండడం ద్వారా విలువలు సరిగ్గా వస్తాయి. ఫిజిక్స్లో 20 ప్రయోగాంశాలు ఉంటాయి. వాటిని 38 ప్రశ్నలుగా ఇస్తారు. వాటిని చదువుకుని తర్ఫీదు పొందాలి. వాటిలో ఎంపిక చేసిన ఒక అంశానికి ప్రయోగం చేయడం ద్వారా 21 మార్కులు పొందుతారు. అందులో ఫార్ములాలు, టేబుల్, గ్రాఫ్లను వేయాలి. రికార్డు రాసినందుకు నాలుగు, వైవాకు ఐదు మొత్తం 30 మార్కులుంటాయి.

–బలుసు ధన ప్రసాదరావు, అధ్యాపకుడు, భౌతిక శాస్త్రం, మండపేట

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- ఎమ్మెల్సీ అభ్యర్థిగా కుడుపూడి ఎంపికపై శెట్టిబలిజ సంఘం హర్షం
- జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

మండపేట: బడుగు బలహీన వర్గాలను అధికారంలో భాగస్వాములు చేయడం ద్వారా సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని మండపేట శెట్టిబలిజ సంఘం నాయకులు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి శెట్టిబలిజ సామాజికవర్గ నేత కుడుపూడి సూర్యనారాయణను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ తదితరులు సీఎం జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ రాజకీయ పార్టీ ఇంత పెద్ద ఎత్తున ఎస్సీ, బీసీలకు పదవులు ఇవ్వలేదన్నారు. సంఘాధ్యక్షుడు పెంకే గంగాధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు బొక్కా సరస్వతి, నీలం దుర్గ, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ రామారావు, సంఘ నాయకులు కుడిపూడి రాంబాబు, పెంకే వెంకట్రావు, పంపన పద్మారావు, కుక్కల శ్రీనివాస్, యాండ్ర ప్రభాకరరావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సముచిత స్థానంపై హర్షం

కపిలేశ్వరపురం: తమ సామాజిక వర్గానికి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వడంపై మండల శెట్టిబలిజ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అంగర బీసీ కమ్యూనిటీ హాల్ వద్ద మంగళవారం సంఘం నాయకులు మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన కుడుపూడి సూర్యనారాయణకు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఇవ్వడం తమకు ఆనందం కలిగిందన్నారు. వాసంశెట్టి వాసు, పార్థసారథి, మేడిశెట్టి దుర్గారావు, కొప్పిశెట్టి శ్రీనివాస్, కట్టా రామచంద్రరావు సీఎం జగన్కు కృతజ్ఞతలు తెలిపారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



సీఎం జగన్మోహన్రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

రామచంద్రపురం: ప్రజా సంకల్పయాత్రలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు వచ్చినప్పుడు వైఎస్ జగన్మోహన్రెడ్డి మాదిగలకు ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చారని, ఆయన ఇచ్చిన మాట ప్రకారం మాదిగ పోరాట ఉద్యమ నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత బొమ్మి ఇజ్రాయిల్కు ఎమ్మెల్సీ ఇచ్చి మాదిగల చిరకాల కోరికను నెరవేర్చారని, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఏ ప్రభుత్వాలు చేయని విధంగా మొట్టమొదటిసారిగా మాదిగలను చట్టసభలకు అవకాశం కల్పించిన సీఎం జగన్కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు ఉప్పలగుప్తం దేవానందం, మందపల్లి చిట్టిబాబు, దొమ్మలపాటి శ్యాం, బొమ్ము మోహన్రావు, పైడిమళ్ల ఆనంద్ తదితరులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 74 ఏళ్ల తరువాత మాదిగలకు ఎమ్మెల్సీ అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్దేనన్నారు. కార్యక్రమంలో చుట్టుగుళ్ల యేషయా, దొమ్మలపాటి సత్యనారాయణ, తాతపూడి ప్రకాశ్, లంక రమణ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను మరువకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న నాగసుబ్రహ్మణ్యం

మండపేట: ఆధునిక జీవన విధానంలో ఎన్ని భాషలు నేర్చుకున్నా అమ్మలాంటి మాతృభాషను ఎప్పటికీ మరువకూడదని సినీ నటుడు వియ్యూరి నాగసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు అధ్యక్షతన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 'లవకుశ'సినిమాలో తాను కుశుడు పాత్ర పోషించానని, పది వేల సార్లు వివిధ గ్రామాలలో బుర్రకథలు చెప్పానన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు మాతృభాష ఔన్నత్యాన్ని, తెలుగులోని తియ్యదనాన్ని వివరించాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బంగ్లాదేశ్కు చెందిన యువకులు తమ మాతృభాష కోసం చేసిన త్యాగాలకు గుర్తుగా ఐక్యరాజ్యసమితి ఫిబ్రవరి 21ను ప్రపంచ మాతృభాష దినోత్సవంగా జరుపుకోవాలని సూచించిందన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. లెక్చరర్లు ఆనంద్, త్రినాథ్, కిరణ్, కేఎస్ఆర్ ఆశిష్బాబు, మధు, గోపాలకృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం



అన్నపూర్ణా, విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి శ్రీపుష్పోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన అన్నపూర్ణా, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణంలో భాగంగా మంగళవారం శ్రీపుష్పోత్సవాన్ని ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు) ఆధ్వర్యంలో కొంతేటి బాలసుబ్రహ్మణ్యశర్మ, కొంతేటి విశ్వనాథశర్మల బ్రహ్మత్వంలో వైభవంగా నిర్వహించారు. దంపతులకు దంపతి తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వల్లూరులో నోడల్ అధికారి పర్యటన



వల్లూరు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారి బరువును పరిశీలిస్తున్న సీడీపీఓ

కపిలేశ్వరపురం: మండలంలోని వల్లూరులో గ్రామ నోడల్ అధికారి హోదాలో ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి మంగళవారం పర్యటించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను, రికార్డులను పరిశీలించారు. భోజనాన్ని రుచి చూసి విద్యార్థులకు వడ్డించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలోని సిబ్బంది సేవలను, చిన్నారుల హాజరు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక విద్యార్థి వయస్సుకు తగ్గ బరువు లేకపోవడాన్ని గుర్తించి ప్రత్యేక చర్యలకు ఆదేశించారు. చిన్నారి తల్లికి పోషకాహారంపై అవగాహన కల్పించి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆమె వెంట సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గుత్తుల హైమావతి, మహిళా పోలీసు ప్రమీల, హెచ్ఎం లక్ష్మణరావు ఉన్నారు.

బాలుడిపై కుక్క దాడి



కుక్క దాడిలో గాయపడిన మనోజ్

రాయవరం: బాలుడిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ ఘటన మంగళవారం పసలపూడిలోని గోపరితోటలో చోటు చేసుకుది. ఈ గ్రామానికి చెందిన బలగం మనోజ్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కల గుంపులో నుంచి ఒక కుక్క వచ్చి ఆకస్మికంగా దాడి చేసింది. ఈ దాడిలో బాలుడి ఎడమ తొడ వెనుక భాగంలో గాయమైంది. వెంటనే తల్లిదండ్రులు రమాదేవి, శ్రీనివాస్లు బాలుడ్ని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. గతంలో కూడా కుక్కలు బాలుడిపై దాడి చేసి గాయపరిచాయన్నారు. పాఠశాలకు వెళ్లే సమయంలో కుక్కలు విద్యార్థులపై దాడి చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కుక్కలను అదుపు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి



దుగ్గుదుర్రులో పంటపొలాల్లో నిలబడి ఆందోళన వ్యక్తం చేస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

కాజులూరు: శివారు భూములకు సాగునీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కౌలురైతు సంఘం నాయకులు పర్యటించి నీటి ఎద్దడికి గురౌతున్న వరి పొలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి నేపథ్యంలో తూర్పుడెల్టా కాలువ శివారు భూముల్లో ఉన్న కాజులూరు మండల గ్రామాలకు తీవ్ర సాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. అధికారులు సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూముల పొలాలకు ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలపైనా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల కౌలు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- గోవింద నామస్మరణతో మార్మోగుతున్న అర్తమూరు
- స్వామివారికి నైవేద్యంగా 116 కిలోల లడ్డూ సమర్పణ



పుట్టమన్నుకు పూజలు చేస్తున్న బులిస్వామిరెడ్డి తదితరులు

మండపేట: మండలంలోని అర్తమూరు గ్రామం గోవింద నామ స్మరణతో మార్మోగుతోంది. ఇక్కడ కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా మొదలయ్యాయి. శ్రీవారి భక్తమండలి చైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో అర్తమూరు, పరిసర గ్రామాలకు చెందిన 450 మంది భక్తులు గోవింద మాలలు ధరించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా అంకురార్పణ జరిగింది. పుట్టమన్ను తెచ్చి యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లిడి హరినాథరెడ్డి, సుజాత ప్రధాన యాజమాన్య దంపతులుగా పూజలు ప్రారంభించారు. తాపేశ్వరానికి చెందిన భక్తాంజనేయ స్వీట్స్స్టాల్ అధినేత సలాది శ్రీనుబాబు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు కానుకగా అందజేసిన 116 కిలోల లడ్డూను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. బులిస్వామిరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రూ.12 లక్షలతో మూలవిరాట్ అలంకరణ



రూ.12 లక్షల విలువైన నోట్లతో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కరెన్సీ నోట్లతో స్వామివారి మూల విరాట్ను ప్రత్యేకంగా అలంకరించారు. ఇందుకోసం దాదాపు రూ.12 లక్షలు విలువైన రూ.10, రూ. 20, రూ.50, రూ.100, రూ.200, రూ.500, రూ.2000 నోట్లను వినియోగించారు. కాండూరి వెంకటరమణాచార్యుల పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకల్లో కర్రి బాపిరెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, వెలగల శివారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రీ సర్వే రాళ్ల ఎరక్షన్ వేగవంతం చేయాలి

- ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం
- రెండు మండలాల్లో పర్యటన



చెల్లూరులో సరిహద్దు రాళ్ల ఎరక్షన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం

రాయవరం: రామచంద్రపురం ఆర్డీవో సింధు సుబ్రహ్మణ్యం మంగళవారం మండలంలో పర్యటించారు. జగనన్న భూహక్కు-భూరక్ష పథకంలో భూములు రీ సర్వేను లొల్ల, పసలపూడి, చెల్లూరు, సోమేశ్వరం, కురకాళ్లపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించారు. రీ సర్వే అనంతరం సరిహద్దు రాళ్లను ఎరక్షన్ చేస్తున్నారు. ఆ కార్యక్రమాన్ని ఆర్డీవో పసలపూడి, చెల్లూరు గ్రామాల్లో పరిశీలించారు. ఈ పనులను వేగవంతం చేయాలని తహసీల్దారు కేజే ప్రకాష్బాబుకు సూచించారు.ఉపాధి హామీ కూలీలతో సరిహద్దు రాళ్ల ఎరక్షన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు ప్రకాష్బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నేలటూరులో సర్వే ప్రక్రియ పరిశీలన

కపిలేశ్వరపురం: నేలటూరులో చేపట్టిన భూ రీ సర్వే ప్రక్రియను రామచంద్రపురం ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించారు. రీసర్వేలో భాగంగా మండల అధికారుల పర్యవేక్షణలో సరిహద్దు రాళ్లను అమర్చుతున్నారు. పనుల తీరును, రికార్డుల గురించి ఆర్డీఓ మండల అధికారులను ఆరా తీశారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ కొమరం సూర్యారావును ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, మండల, సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలి



జిల్లా దేవదాయ శాఖ అధికారి ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న నరాల రాజ్యలక్ష్మి, రైతులు

రామచంద్రపురం: మండలంలోని వెంకటాయపాలెం పరిధిలో వ్యవసాయ భూములు కలిగిన రైతులు తమ భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలు నరాల రాజ్యలక్ష్మితో కలసి మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దేవదాయ శాఖ అధికారి కేఎన్వీడీవీ ప్రసాద్ను కలసి వినతిపత్రం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామ పరిధిలో 18 మంది రైతులకు చెందిన 8.43 ఎకరాల వ్యవసాయ భూములు, శ్రీ పైండా వెంకన్న రామకృష్ణయ్య అన్నసత్రం భూములతో పాటు ఒకే సర్వే నంబరు 30లో కలసి ఉన్నాయి. మొత్తం సర్వే నంబర్ను నిషేధిత భూముల జాబితాలో పెట్టడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతు కడియాల కోదండ రాముడు 2020 అక్టోబరులో మీసేవ ద్వారా పెట్టుకున్న అర్జీతో రామచంద్రపురం తహసీల్దార్ పి.తేజేశ్వరరావు సమగ్రంగా దర్యాప్తు చేసి రైతుల భూముల విషయంలో పొరపాటు జరిగిందని గుర్తించి దీనిని డీనోటిఫై చేసే అధికారం దేవదాయ శాఖ అధికారులకే ఉందని నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. వైస్ ఎంపీపీ దేవదాయ శాఖ జిల్లా అధికారి కేఎన్వీడీవీ ప్రసాద్ను త్వరితగతిన రైతుల భూములు డీనోటిఫై చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు కడియాల కోదండరాముడు, వాసంశెట్టి యేసు, కడియాల సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీను, పలివెల ఇమ్మాను యేల్, గుత్తుల భీమశంకరం పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి గృహసారథులు కృషి చేయాలి

మంత్రి వేణు



గొల్లపాలెంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణలో ప్రసంగిస్తున్న మంత్రి వేణు

కాజులూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం కావటానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ అన్నారు. గొల్లపాలెం వెంకటపద్మావతి రైస్మిల్ గ్రౌండ్లో మంగళవారం పార్టీలో కొత్తగా నియమితులైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునేందుకు సీఎం జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని నవరత్నాల పథకంలో భాగంగా ఇచ్చిన హామీలతో పాటు అదనంగా మరో 50 కొత్త పథకాలు అమలు చేశారన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ఎక్కడా ఆపలేదన్నారు. జగనన్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని అన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వలంటీర్లతో సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. అనంతరం పార్టీ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ప్రజలకు చేరవేయటంలో వలంటీర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. అయితే ఎన్నికల సమయంలో వలంటీర్లు ప్రజలకు పథకాలు అములులో దూరంగా ఉండవలసి ఉంటుందన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వలంటీర్లతో కలసి పనిచేస్తూ జగనన్న పథకాల వలన ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను ఎప్పటికప్పుడు వారికి వివరించాలన్నారు. పార్టీ భవితవ్యం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలపైనే ఆధారపడి ఉందని రానున్న ఎన్నికల్లో మరోసారి పార్టీ విజయాలని అందరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, స్థానిక గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, పప్పుల మస్సేనువెంకన్న, ఆర్ఎంసీ చైర్మన్ పండుల గోవిందరావు, గృహసారథుల మండల కన్వీనర్ చింతపల్లి నాగేంద్రప్రసాద్ పలు గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.